క్లుప్తంగా

ఆర్బీకేల సేవలు సద్వినియోగం



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: ఆర్బీకేల సేవలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి ఆర్బీకే వద్ద శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. విత్తనాలను రాయితీపై రైతులకు అందజేస్తున్నామన్నారు. వ్యవసాయ యంత్రాలను కూడా రాయితీపై ప్రభుత్వం అందజేస్తున్నట్టు చెప్పారు. అధికారుల సలహాలు,సూచనలను రైతులు పాటించాలన్నారు. వీఏఏ తులసీ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమైన ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి

ఎస్.రాయవరం: మండలంలో తిమ్మాపురం కస్తూర్బా విద్యాలయానికి నూతన ప్రిన్సిపాల్‌గా జి.ఉమామహేశ్వరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గత ఏడాది ఆగస్టులో ఇక్కడి ప్రిన్సిపాల్ బదిలీ కావడంతో అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రతి చిన్న అవసరానికి పిల్లలను పాఠశాల నుంచి తీసుకెళ్లడం సరికాదన్నారు. సౌకర్యాల్లో లోటుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రీ సర్వే వేగవంతానికి చర్యలు

మునగపాక : గ్రామాల్లో భూ రీ సర్వే వేగవంతమయ్యేలా చూడాలని తహసీల్దార్ పి.ప్రకాశరావు సిబ్బందిని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, సర్వేయర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో సర్వే చేసేటపుడు, సరిహద్దు రాళ్లు వేసేటపుడు రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. ఈ విధానం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మునగపాక: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజల వద్దకే వైద్య సేవలందుతున్నాయని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని తోటాడలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన ప్రతి కార్యక్రమం ప్రజలకు ఎంతగానో మేలు చేస్తుందని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ విమలగిరి పాల్గొని వైద్య సేవలందించారు. సీజన్‌లో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అనారోగ్యం వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

ఎస్.రాయవరం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల రాధా, రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో వంగవీటి రంగా విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నగేష్, జనసేనపార్టీ నాయకులు గెడ్డం బుజ్జి, సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు అమలకంటి అబద్ధం, తన్నీరు యరకయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ సంక్షేమం

ధ్రువపత్రాల పంపిణీలో ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు, అధికారులు



రాంబిల్లి: ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

పాయకరావుపేట/ నక్కపల్లి: పైసా ఖర్చులేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శుక్రవారం పాయకరావుపేట మండలంలోని అరట్లకోట, నక్కపల్లిలోని గొడిచర్లలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు కుల, ఆదాయ, నివాస, జనన తదితర ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం చరిత్ర సృష్టిస్తోందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వారం రోజుల పాటు ప్రజల వద్దకే వెళ్లి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారు కోరిన ధ్రువపత్రాలు గ్రామసభల్లో అందించడం గొప్ప విషయమన్నారు. ఇంతకు ముందు ఈ ధ్రువపత్రాల కోసం ఈ సేవా కేంద్రాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఈ ఇబ్బందులన్నింటిని గుర్తించిన ప్రభుత్వం విద్య, ఉద్యోగం, సంక్షేమ పథకాలకు సంబంధించిన ధ్రువపత్రాలను కేవలం రెండు రోజుల వ్యవధిలో అందిస్తోందన్నారు. మీకు, మీ కుటుంబానికి మంచి జరిగిందనిపిస్తేనే మాకు ఓటేయండి లేదంటే వద్దని ధైర్యంగా చెప్పిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకాన్ని రాద్ధాంతం చేసి లబ్ధిపొందాలని ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాలకు మళ్లీ భంగపాటు తప్పదన్నారు. చంద్రబాబును, టీడీపీని ప్రజలు పూర్తిగా పట్టించుకోవడం మానేశారని, ఉనికి కాపాడుకునేందుకు చంద్రబాబు నీచరాజకీయాలకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. అరట్లకోట సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతి, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, సర్పంచ్‌లు గారా ఉష శ్రీ, పి.అప్పలనర్స, పేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, గొడిచెర్ల సమావేశంలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, సర్పంచ్ అల్లు పార్వతి రమణ, ఎంపీటీసీ నిట్ల గోవిందు, ఎంపీడీవో సీతారామరాజు, డీటీ నీరజ, వైఎస్సార్‌సీపీ నాయకులు శీరం నర్సింహమూర్తి, నల్లల రామకృష్ణ, వెలగా వెంకటశివ, కార్యదర్శి సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- పాయకరావుపేట గ్రామం సచివాలయం-4లో మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ బృందం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్, ఇన్‌కమ్, రైస్ కార్డులు తదితర సర్టిఫికెట్ల కోసం 250 మంది దరఖాస్తు చేసుకోగా వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి చేతుల మీదుగా అర్హులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్, పంచాయతీ సభ్యులు ధనిశెట్టి మహేష్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

రాంబిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. రాజుకోడూరు, హరిపురం గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల ధృవీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని కొనియాడారు. తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజల్ని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా, అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రజలు ధ్రువపత్రాల కోసం మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా సచివాలయాల వద్దే ధ్రువపత్రాలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను నమ్మకుండా మళ్లీ సీఎంగా జగనన్నను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.భాగ్యవతి, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, సర్పంచ్‌లు ముత్తా శంకర్రావు, ధూళి దేవుడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పారిపిల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : జగనన్న సురక్ష ప్రతి సమస్య పరిష్కారానికి వేదికగా మారుతోందని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. గుర్రాజుపేటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వంలో పేదలకు ప్రయోజనం చేకూరేలా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా ఇచ్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

బీసీ–డీ ధ్రువపత్రాలకు వినతి

జగన్న సురక్షలో బీసీ డీ తూర్పుకాపు ధ్రువపత్రాలను కూడా మంజూరు చేయాలని సర్పంచ్ రావి రమణబాబు అధికారులను కోరారు. తహసీల్దార్ బృందంతో శుక్రవారం సైతారుపేటలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేస్తే వాటిని పరిశీలించి వీలైనంత వేగంగా ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, గుర్రాజుపేట సర్పంచ్ రత్నం, ఎంపీడీవో రామచంద్రమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: పారదర్శక, సంక్షేమ పాలన సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని కైలాసపట్నం, చినబొడ్డేపల్లి గ్రామాలలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కైలాసపట్నంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, చినబొడ్డేపల్లిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందించారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఏదో ఒకక రూపంలో సంక్షేమం అందుతోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సర్టిఫికెట్లు ఒక్క రోజులోనే అందిస్తున్నట్టు తెలిపారు. కైలాసపట్నంలో జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, సర్పంచ్ నూక రత్నం, ఎంపీటీసీ రమణ, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డీటీ సోమశేఖర్, చినబొడ్డేపల్లిలో సర్పంచ్ పైల శివరామ్, తహసీల్దారు జానకమ్మ, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.



గొడిచర్లలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



అరట్లకోటలో దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



గుర్రాజుపేటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



కైలాసపట్నంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు

సొంతింటి కల నెరవేర్చడమే సీఎం జగన్ ధ్యేయం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బాబూరావు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట: రాష్ట్రంలో సొంత ఇల్లు లేనివారందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని పీఎల్ పురం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటికీ వెళ్లారు. గ్రామంలో పలువురు మహిళలు తమకు ఇంటి స్థలం మంజూరుకాలేదని, అధికారులకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా స్పందించట్లేదని తెలిపారు. అర్హులకు తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, నిర్మాణానికి రుణాలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం గ్రామంలో అర్హులకు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పథకాల నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా? లేదా? అని తీశారు. గ్రామంలో పాఠశాలల అభివృద్ధి, రక్షిత తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధ్రువపత్రాల్లేక సంక్షేమ పథకాలు అందుకోలేని వారందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను గ్రామస్తులకు, లబ్ధిదారులకు అందించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదగాలన్నా జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతుగా నిలిచి, రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతి, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, సర్పంచ్ పడాల సోమన్నదొర, తహసీల్దార్ కె.జయప్రకాష్, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, పీఏసీఎస్‌ల చైర్మన్లు దేవవరపు రాజేష్ ఖన్నా, కె.సుందరీలత, ఉపసర్పంచ్ జగతా భవాని, అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న సురక్ష సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష సర్వేకు సంబంధించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఒక్కరికీ మేలు చేస్తుందన్నారు. అర్హులైనప్పటికీ ఇంతవరకు సంక్షేమ పథకాలు అందుకోని వారిని గుర్తించాలన్నారు. ప్రతీ వలంటీర్ బాధ్యతగా సర్వే చేపట్టాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో మన్మధరావు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ సొంత భవనాలు

ప్రాధాన్యతా భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బాబూరావు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : రానున్న రోజుల్లో ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి సొంత గూడు నిర్మించాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో నక్కపల్లి, వెదుళ్లపాలెం, చినదొడ్డిగల్లు, నెల్లిపూడి, గునిపూడి, దేవవరం, డొంకాడ గ్రామాల్లో సుమారు రూ.80 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, సామాజిక భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ అవసరాల కోసం మండల కేంద్రాలకు రావాల్సిన అవసరం లేకుండా దాదాపు 12 ప్రభుత్వశాఖల సిబ్బందితో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామని, ప్రతి సచివాలయంలో రూ.40 లక్షల వ్యయంతో నూతన భవనాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు.జిల్లా కేంద్రంలో మాదిరిగా అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అన్నదాతల కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటికి కూడా నూతన భవనాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. నాడు నేడు పథకంలో అంగన్‌వాడీ కేంద్రాలను చేర్చి, వాటికి కూడా పక్కా భవనాలు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌యూఐడీసీ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, సర్పంచ్‌లు ఆనందరావు, కొండలరావు, నర్సింహమూర్తి, శంకర్రావు, చినపేర్రాజు, సురేష్‌వర్మ, ఎంపీటీసీలు తోటసత్తిబాబు, వెదుళ్ల రమణ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు శీరం నర్సింహమూర్తి, సూరాకాసుల గోవిందు, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ అంబేడ్కర్, ఏవో ఉమాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

14న అడ్డురోడ్డులో జాబ్ మేళా



జాబ్‌మేళా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తదితరులు

ఎస్.రాయవరం: ఈ నెల 14న అడ్డురోడ్డు శ్రీ ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. ఈ మేరు జాబ్‌మేళా గోడ పత్రికను కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాల్లో 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న యువత దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో మేళా ఏర్పాటు చేస్తున్న ఏవీఎస్ డిగ్రీ కళాశాల, ప్రజ్ఞ జూనియర్ కళాశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. వివరాలకు 8247505171 నంబర్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌కు నిప్పంటించిన దుండగులు

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ఓ ద్విచక్ర వాహనానికి నిప్పంటించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అరబుపాలెం గ్రామానికి చెందిన కొయిలాడ చైతన్య తన ఇంటి ముందు గురువారం రాత్రి బైక్‌ను పార్క్ చేసి, నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి దాటాక బైక్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న చైతన్య కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూడగా బైక్ చుట్టూ మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. బాధితుడు చైతన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

మునగపాక: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలను మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజన్న పాలన సువర్ణయుగంగా నడిచిందన్నారు. ఆయన జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకునే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నేతలు నివాళులర్పించాలన్నారు. మండల కేంద్రమైన మునగపాక నందీశ్వర ప్రాంగణంలో నిర్వహించనున్న జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మలు అతిథులుగా హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఎస్.రాయవరం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకల్ని మండల కేంద్రం ఎస్.రాయవరంలో శనివారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరుకానున్నట్టు తెలిపారు.

రోడ్డు, బడి వచ్చేంత వరకు దీక్ష ఆగదు



అణుకు గ్రామ సమస్యలపై రిలే నిరాహార దీక్ష చేపట్టిన గిరిజనులు, సీపీఎం నాయకులు

కోటవురట్ల: అణుకు గిరిజన గ్రామంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. గ్రామానికి రహదారి, గూడెంలో బడి కోసం డిమాండ్ చేస్తూ గొట్టివాడ శివారు మెయిన్‌రోడ్డు నుంచి అణుకు గ్రామానికి వెళ్లే రహదారి ప్రారంభంలో శిబిరం ఏర్పాటు చేసి శుక్రవారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గిరిజనులు రహదారి లేక బడికి, వైద్యానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు నివసిస్తున్నాయని, పిల్లలతో కలిసి దాదాపు 150 మంది ఉన్నారన్నారు. ఇందులో సుమారు 40 మంది చిన్నారులు చదువుకునేందుకు నానా అవస్థలు పడుతున్నట్టు పేర్కొన్నారు. దీక్షలో మండల కార్యదర్శి జి.డేవిడ్‌రాజ్, గిరిజనులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



కొరుప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం: దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని పెనుగొల్లు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ అన్నారు. కొరుప్రోలు గ్రామంలో డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమకాటు ద్వారా వచ్చే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా తదితర రోగాల నివారణపై అవగాహన కల్పించారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఎస్.రాయవరంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి తంటపురెడ్డి నాగేశ్వరరావు, ప్రసాద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

'తూర్పు కాపులకు బీసీ డీ సర్టిఫికెట్లివ్వాలి'




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తూర్పుకాపు సంఘ నాయకులు

ఎస్.రాయవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో బీసీ డీ తూర్పుకాపు కుల ధ్రువీకరణపత్రాలు కూడా ఇవ్వాలని తూర్పుకాపు సంఘ నాయకులు మిల్లు శ్రీను, కరణం శ్రీహరి, వెలగా అప్పారావు, అడపా శేషగిరి కోరారు. అడ్డురోడ్డులో తూర్పుకాపు శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమంలో అవసరమయిన వారికి కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్, రేషన్‌కార్డు తదితర 11 సర్వీసులు ఉచితంగా అందించడం శుభపరిణామమన్నారు. అయితే ఎస్.రాయవరం మండలంలో తూర్పు కాపు కుల ధ్రువీకరణ పత్రాలు పూర్తిగా నిలిపివేశారని, కొన్ని మండలాల్లో ఇస్తూ, ఇక్కడే ఎందుకు నిరాకరిస్తున్నారని ఆక్షేపించారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘ నాయకులు తాటిపాకల నాని, ఆకుల వెంకటేష్, దమ్ము సురేష్, కనపర్తి మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో అగ్రి ల్యాబ్

నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



యలమంచిలిలో ఏర్పాటైన అగ్రి టెస్టింగ్ ల్యాబ్

యలమంచిలి : విత్తనం మంచిదైతే పంట దిగుబడి బాగుండి రైతులకు వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. అదే నాసిరకమైన విత్తనమైతే దిగుబడులు తగ్గి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిందే. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల వల్ల రైతులు మోసపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికొక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను నెలకొల్పింది. దీనిలో భాగంగా యలమంచిలిలో సుమారు రూ.80 లక్షలతో అగ్రీ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. దీన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే యూవీ రమణ మూర్తిరాజు ప్రారంభించనున్నారని మండల వ్యవసాయాధికారి మోహనరావు శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రైతులకు అందుబాటులోకి రావడంతో కల్తీ విత్తనాలు, ఎరువులకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. దీంతో రైతులకు పంట నష్టం, సాగు వ్యయం తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ ల్యాబ్‌లో రైతులు తెచ్చే విత్తనాల నాణ్యత, మొలక శాతాన్ని పరీక్షించి రెండు మూడు రోజుల్లో ఫలితాలను అందిస్తామన్నారు. ల్యాబ్ వద్దకు రైతులు నేరుగా శాంపిళ్లను తెచ్చినా, గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి అందించినా సరిపోతుందన్నారు. నమూనాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే వ్యవసాయాధికారులు సరుకు విక్రయించిన డీలర్ వద్ద నమూనాలు సేకరించి జిల్లా స్థాయి ల్యాబ్‌లో మరోసారి పరీక్షించి నిర్ధారిస్తామని, అక్కడ కూడా నాసిరకమని తేలితే కఠిన చర్యలు తప్పవన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం అందుకున్న బదిలీ ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమని, ఎక్కడ పని చేసినా అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందని ధర్మవరం అగ్రహారం ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణారావు అన్నారు. ఇటీవల బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు, ఇతర సబ్జెక్టు టీచర్లను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా వ్యవహరిస్తే మంచి విద్యార్థులు తయారవుతారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెదుళ్ల బంగారి సూచించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ చందక రమణ, ఉపాధ్యాయులు గారా ప్రకాష్, ప్రసాద్, అర్జున్ రాజు తదితరులు పాల్గొన్నారు.